క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



కాకుమాను: విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు. పెదనందిపాడు మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన ఆళ్ల వెంకట్(ఎన్ఆర్ఐ) మిత్రుల సహకారంతో మండలంలో ఈ ఏడాది పది పరీక్షలకు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య అనేది మూడవ నేత్రమని తెలిపారు. విద్యను ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు.దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో ఉండి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా మండలంలో ఈ ఏడాది పది పరీక్షలకు హాజరవుతున్న 136 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.కార్యక్రమంలో భాస్కరరావు, గుంటుపల్లి అప్పారావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



కాకుమాను: చట్టాలపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని గుంటూరుకు చెందిన న్యాయవాది ఝాన్సీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మహిళలపై రోజు రోజుకు అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని తెలిపారు.మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రతి మహిళా ఇంటికే పరిమితం కాకుండా చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆమె తెలిపారు.ముఖ్యంగా విద్యార్థినులు చట్టాల గురించి తెలుసుకుని సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి తల్లులకు వివరించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు చట్టాలకు సంబంధించిన బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో లాయర్ కట్టా కాళిదాస్, హెచ్ఎం బి.సత్యం, ఏఎస్ఐ కె.రమేష్ బాబు, స్టేషన్ రైటర్ శ్రీకాంత్,ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదకాకాని: గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కొప్పురావూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ మాబు కూలి పనులు చేసుకుంటూ మద్యానికి బానిసగా మారాడు. భార్య మద్యానికి డబ్బులు ఇవ్వలేదని నవంబర్ 17న గడ్డి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పది రోజులు పాటు చికిత్స చేసిన తరువాత డాక్టర్లను వేధించి ఇంటి చేరాడు. ఎప్పటి మాదిరిగానే తిరిగి మద్యం తాగడం మొదలు పెట్టాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు డిసెంబర్ 4న మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మాబు(53) పరిస్థితి విషమించి ఈనెల 26న రాత్రి మరణించాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య రహ్మతున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆటో బోల్తా పడి యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడటంతో యువకుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో శుక్రవారం జరిగింది. గ్రామంలోని జగనన్న కాలనీలో నివాసం ఉండే షేక్ ఖాజా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల కిందట భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దీంతో దూరంగా ఉన్న షేక్ ఖాజా ఆటోలో భార్య పిల్లలను చూడటానికి బయలు దేరాడు. మార్గమధ్యలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఖాజామీద ఆటో పడటంతో కాలు విరగటంతో పాటు, తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరిల్ పాల్‌పై కొనసాగుతున్న విచారణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అకౌంట్స్ విభాగంలో జరిగిన అవకతవకలపై గతంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన సిరిల్‌పాల్‌పై విచారణ కొనసాగుతోంది. శుక్రవారం విచారణలో భాగంగా లాలాపేట పోలీసులు సిరిల్‌పాల్‌ను తీసుకొచ్చి నగర కమిషనర్, అదనపు కమిషనర్‌లతో మాట్లాడించారు. అనంతరం అకౌంట్స్ విభాగంలో విచారించారు.

వంచనలో ఘనుడు చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ పోరు బాటలో పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- ఆరు నెలల్లోనే కూటమి పాలనలో బాదుడే.. బాదుడు
- రెండు విడతల్లో వినియోగదారులపై రూ. 15.485 కోట్ల విద్యుత్ భారం
- విద్యుత్ చార్జీలు పెంచమని చంద్రబాబు ఎన్నికల హామీ గాలికి..
- నేడు ప్రజా వ్యతిరేకపాలన
- ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కరెంట్ చార్జీల మోత



నిరసన ర్యాలీలో పాల్గొన్న మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15,485 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించడంలో ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలను వెనక్కి తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 'కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట' పేరుతో శుక్రవారం అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సభలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి రెండు సార్లు పెంచి ప్రజలను మోసగించిందని తెలిపారు. ఇప్పటికే రూ.6,072 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారాన్ని మోపారని, ఇక నుంచి మరో రూ. 9,412 కోట్ల భారం మోపేందుకు సిద్ధమైందని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేయడంతో పాటు ఐదేళ్ల విద్యుత్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తుందని ఆరోపించారు.



ఏడీఈ శ్యాంకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంబటి మురళీకృష్ణ, నేతలు



ఎంపీపీ పద్మలీల, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అన్నివర్గాలకూ మోసం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మురళీకృష్ణ దుయ్యబట్టారు. ఉచిత పంటల బీమాకు మంగళం పాడి రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని, దళారీ వ్యవస్థతో కుమ్మక్కై, ధాన్యాన్ని తక్కువ ధరకు కొని అన్నదాతలను మోసగిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు ప్రైవేట్ ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయని తెలిపారు. ఉచిత విద్య, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయగా.. ప్రస్తుత చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏడీఈ జి. శ్యాంకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల, చేబ్రోలు, పెదకాకాని వైఎస్ ఎంపీపీలు పసుపులేటి శ్రీనివాస్, కామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కోటేశ్వరరావు, జాని, విజయ్, జైపాల్‌రెడ్డి, లతీఫ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తోటకూర వెంకటేశ్వరరావు, సర్పంచులు బొనిగల నాగమల్లేశ్వరరావు, చుండూరు వీరయ్య, వీరాంజనేయప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పెదకాకాని పార్టీ మండలాధ్యక్షుడు చాగంటి మురళీకృష్ణ, ముఖ్య నాయకులు ఉయ్యూరు సతీష్‌రెడ్డి, జోసఫ్, రాఘవ, శ్రీరామరెడ్డి, సాయిబాబు, అబ్దుల్, శ్రీధర్‌రెడ్డి, బొనిగల వేణుప్రసాద్, షేక్ నాజర్, అంబటి వెంకటేశ్వరరావు, షేక్ మాము, మందాల శివారెడ్డి, కృష్ణారెడ్డి, కానూరు శంకరరావు, వట్టిప్రోలు రంగారావు, ఎండేటి వెంకట సుబ్బయ్య, మూర్తిరాజు, గేరా సంజీవ్, కె. సుషోబిత, దేవరకొండ గోపి, ఆకుల రామ్మోహన్, ఎస్. ఈశ్వరయ్య, వెంకట మోహనరావు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు

పోలీసుల అత్యుత్సాహం

విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు లోపలికి వెళ్లే క్రమంలో అడ్డుకున్నారు. బారికేడ్లు అడ్డుపెట్టి ప్రజా ప్రతినిధులు, నాయకులను వెనుకకు నెట్టేయడంతో వారు ఇబ్బందులు పడ్డారు. పోలీసుల చర్యలపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

కదంతొక్కిన వైఎస్సార్ సీపీ నాయకులు

- కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట
- గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై నిరసన
- వైఎస్సార్ కాంస్య విగ్రహం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ ఫ్లెక్సీ, పోస్టర్లతో ర్యాలీ
- ప్రభుత్వ తీరును ఎండగట్టిన పార్టీ నాయకులు
- పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేసే వరకూ ప్రజల తరఫున పోరుబాట తప్పదని స్పష్టం



ప్రత్తిపాడులోని గుంటూరు- పర్చూరు పాత మద్రాసు రోడ్డులో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ



ఏఈ గౌతమ్‌కు డిమాండ్ పత్రాన్ని అందజేస్తున్న పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: కరెంటు చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కారు. గద్దెనెక్కిన ఆరు మాసాల్లోనే ఈ బాదుడేంది.. చంద్రబాబూ ! అంటూ నిరసన నిరసన గళం విప్పారు. పెంచిన విద్యుత్ చార్జీలు పేద, మధ్య తరగతి కుటుంబాల్లో చీకట్లు నింపుతాయని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు ఇవ్వాలంటూ ముక్తకంఠంతో నినదించారు. పెంచిన చార్జీలు రద్దు చేసేవరకూ వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదని హెచ్చరించారు.

■ పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల తరఫున నిరసనలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రభుత్వ తీరును ఎండగడుతూ 'కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు గుంటూరు– పర్చూరు పాత మద్రాసు రోడ్డులోని పాతమల్లాయపాలెం కూడలిలో ఉన్న దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహం నుంచి నిమ్మగడ్డవారిపాలెం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ ఫ్లెక్సీలు, పోస్టర్లుతో నిరసన ర్యాలీ చేశారు. 'రద్దు చేయాలి.. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే, ఆపాలి ప్రజలపై.. బాదుడే బాదుడు, తగ్గించాలి తగ్గించాలి పెంచిన విద్యుత్ చార్జీలు, ఇవ్వాలి .. ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్, ప్రజలపై అధికంగా మోపిన కరెంటు చార్జీల భారాన్ని తగించాలి, జై జగన్, వర్ధిల్లాలి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషనులో ఏఈ గౌతమ్‌ని కలిసి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు వెంకటప్పారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ నూనె ఉమామహేశ్వరరెడ్డి, రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓం ప్రకాష్‌రెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ చెరుకూరి సాంబశివరావులు డిమాండ్ పత్రాన్ని అందజేశారు.

■ ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ నూనె ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తూ పెంచిన కరెంటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అబద్దాలె మానుకుని ప్రజలకు మంచి చేయాలని, లేని పక్షంలో ఈ పోరాటం ఆగదని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని అంతకాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రానున్న రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేసి అధికారం నుంచి గద్దెదించే వరకు పోరాడుతామని చెప్పారు.

■ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ చెరుకూరి సాంబశివరావు మాట్లాడుతూ కరెంటు చార్జీల పెంపు దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను ఎత్తివేయడం బాధాకరమన్నారు. వెంటనే కరెంటు చార్జీల పెంపును రద్దు చేసి పేదల అభ్యున్నతికి కృషి చేయాలని హితవు పలికారు.

■ జిల్లా రైతు విభాగం కన్వీనర్ ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోనికి వచ్చిన నాటి నుంచి బాదుడే బాదుడు అంటూ చార్జీలను పెంచుకుంటూ పోతున్నారన్నారు. మొత్తమ్మీద ప్రజలపై పదిహేను వేల కోట్ల భారం మోపేందుకు బాబు పూనుకోవడం సరికాదన్నారు. ఇచ్చి సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని కోరారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం తప్పదని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి పరమారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకట సురేంద్ర, ఎస్సీ సెల్ నాయకుడు గేరా పున్నారావు, ఖాశింపీరా, మార్కెట్ యార్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ రవి, బైరెడ్డి రవీంద్రరెడ్డి, పెద్దిరెడ్డి సామ్రాజ్యం, కవిత, కొండా కృష్ణారెడ్డి, బాపతు వెంకటరమణ, గుజ్జుల శివారెడ్డి, దాసరి చెంచురామారావు, నాదెండ్ల రామచంద్రయ్య పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



ఐలాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ పరిశీలిస్తున్న ఎస్పీ

పొన్నూరు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలో ఆయన పర్యటించారు. ఐలాండ్ సెంటర్‌లోని బాపట్ల, రేపల్లె, గుంటూరు బస్‌స్టాప్‌ల వద్ద ట్రాఫిక్‌ను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిరంతరం ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని స్టేషన్లలో సిబ్బంది ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 22 వరకు గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఫిజికల్ టెస్ట్ జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రాత పరీక్ష పూర్తయిందని అన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ కోటేశ్వరరావు, పట్టణ సీఐ రవి కిరణ్, ఎస్ఐలు రాజ్‌కుమార్, శ్రీహరి, కిరణ్‌బాబు ఉన్నారు.

పెదకాకానిలో..

వాహనదారులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ అన్నారు. పెదకాకాని వై. జంక్షన్‌లో వాహనదారులకు శుక్రవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడం వలన కలిగి ప్రయోజనాలపై ఎస్పీ అవగాహన కలిగించారు. యమధర్మరాజు, రాక్షసుల వేషధారణలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక డెమో నిర్వహించారు. హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడుపుతున్న వారికి గులాబీ పూలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్ఐలు మిరాజ్, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పెదకాకాని: రైతులంతా జీడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పెదకాకానిలో శుక్రవారం బ్యాంక్ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రైతులు పనులు మానుకుని గుంటూరు వెళ్లాల్సి వచ్చేదని, సేవల్ని మరింత చేరువలోకి తీసుకు రావడంలో భాగంగా బ్యాంకును పెదకాకానిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొప్పురావూరు, పెదకాకాని, ఉప్పలపాడు, తక్కెళ్లపాడు రైతులు ఆర్థిక లావాదేవీలు కొనసాగించడానికి, వ్యవసాయ రుణాలు పొందడానికి సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పెదకాకాని వ్యవసాయ పరపతి సంఘం సెక్రటరీ మొవ్వా వెంకటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో భూ సమస్యలకు పరిష్కారం



పొన్నూరు: రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న భూ సమస్యల అర్జీలను నిర్ణీత సమయంలోనే పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నండూరులో నిర్వహించిన సదస్సులో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 34 అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. మ్యుటేషన్లు 12, పాస్ బుక్ రీప్లేస్‌మెంట్ ఆరు, ఎఫ్‌లైన్ ఐదు, ఇతర సమస్యలపై 11 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఏఐ



గుంటూరు రూరల్: అన్ని రంగాల్లో ఏఐ కీలకపాత్ర పోషిస్తోందని, విద్యార్థులు ఆధునిక విద్యా కోర్సులతో పాటూ సాంకేతికత పరిశోధనల వైపు దృష్టి సారించాలని టీసీఎస్ కంపెనీ సీనియర్ కన్సల్టెంట్, డెలివరీ పార్టనర్ ఎం.ఎస్.ఆర్. మూర్తి తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కొలరిజో– 2024 పేరుతో జరుగుతున్న నేషనల్ లెవెల్ టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్‌ఫెస్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూర్తి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో విద్యార్థికి ఉద్యోగాల చేరువకు టెక్నికల్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎల్‌వైఎఫ్ (లవ్ యువర్ ఫాదర్) చిత్ర ఫేమ్ హీరో, హీరోయిన్ హర్షా, కషికా కపూర్ మాట్లాడుతూ భవిష్యత్తును నిర్ణయించేది యువతరమేనని, చలన చిత్రాల్లో మంచి సందేశాన్ని మాత్రమే స్వీకరించాలని తెలిపారు. వివిధ స్టాల్స్, విద్యార్థులతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

పార్మాథాన్– 2024 విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం పార్మాథాన్ 2024 ప్రొటోటైప్ చాలెంజ్ అనే సైంటిఫిక్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. విద్యాధర్ మాట్లాడుతూ ఈనెల రెండవ వారంలో జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో సైంటిఫిక్ కాంపిటీషన్స్ నిర్వహించామన్నారు.వివిధ రాష్ట్రాలనుంచి 50 టీమ్స్ పాల్గొన్నాయని తెలిపారు. అందులో విజేతలుగా నిలిచిన 12 టీంలకు చిప్స్ కళాశాలలో పోటీలను నిర్వహించామని తెలిపారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన గాల్గోషియస్ యూనివర్సిటీ టీంకు రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి పొందిన ఆర్‌వీఆర్‌జేసీ టీంకు రూ. 15 వేలు, తృతీయ స్థానం పొందిన ఎస్ఆర్ఐసీ కళాశాల టీంకు రూ. 10 వేలను కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఆర్. గోపాలకృష్ణ, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ఆర్‌జేఈనెస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహేంద్రకుమార్‌వర్మ, ఐటీబీఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఎం.వి.పి. చంద్రశేఖరరావు, కో ప్రిన్సిపాల్ సజ్జా రాధిక, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.